50 లీటర్ల నాటుసారాతో వ్యక్తి అరెస్ట్.. ద్విచక్ర వాహనం సీజ్

విశాలాంధ్ర-సోంపేట : ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శ్రీకాకుళం, సోంపేట ఎక్సైజ్ అధికారులు శనివారం సంయుక్తంగా నిర్వహించిన దాడుల్లో నర్తు హేమరాజు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని 500 నాటుసారా ప్యాకెట్లు (50 లీటర్లు) స్వాధీనం చేసుకుని రవాణా చేస్తున్న ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశారు. ఎంఎస్‌పల్లి గ్రామం సమీపంలో రాగుపురం వద్ద హేమరాజును అదుపులోకి తీసుకున్నారు. కోర్టులో హాజరు పర్చగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ శ్రీనివాసరావు, సోంపేట ఎక్సైజ్ సీఐ బి.వి.రమణ, ఎస్సై సుజాత, సిబ్బంది భాను ప్రసాద్, విజయ్, గాలిబ్, రమణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మోనింగి వారి చెరువును ఎమ్మెల్యే గోవిందరావు పరిశీలన

విశాలాంధ్ర-హిరమండలం: మండల కేంద్రమైన హిరమండలం మేజర్ పంచాయతీలోని మోనింగి వారి చెరువు అభివృద్ధికై ఉన్నత అధికారులతో మాట్లాడి చెరువు అభివృద్ధికి సహాయ సహకారాలు చేస్తానని పాతపట్నం నియోజకవర్గం శాసనసభ్యులు మామిడి గోవిందరావు శనివారం చెరువు ని చూసి హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి తో ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు గతంలో నిధులు మంజూరుచేసి నప్పటికీ గత నాయకులు నిర్లక్ష్యం వల్ల అభివృద్ధికి నోచుకోలేదు ఇప్పుడు మన కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉన్నత అధికారులతో మాట్లాడి తక్షణమేఉపాధి హామీ నిధులు ద్వారా మోనింగి చెరువుని అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట మండలటీడీపీ అధ్యక్షులుయాళ్ల నాగేశ్వరరావు, ఎం జి ఆర్ యువ సేన అధ్యక్షులు పోతూ రాజు శ్రీధర్, నందిగాం సాయి కృష్ణ, వై తవి టయ్య,వి సాయి, టీడీపీ నాయకులు కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

'నీట్'లో సత్తా చాటిన సోంపేట యువకుడు

నీట్‌లో 942వ ర్యాంక్

విశాలాంధ్ర - సోంపేట : పట్టణానికి చెందిన రొబ్బి మేఘ సాయివర్ధన్ నీట్ పరీక్షలో జాతీయ స్థాయిలో సత్తా చాటాడు. జాతీయస్థాయిలో 942వ ర్యాంక్ సాధించాడు. ఓబిసి కేటగిరిలో 277వ ర్యాంకు లభించింది. దీంతో ఎంబిబిఎస్ చదివేందుకు చాలా మెరుగైన అవకాశాలు లభించడంతో సాయివర్ధన్‌తో పాటు తల్లిదండ్రులు రొబ్బి ధర్మారావు, ఈశ్వరి, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 720 మార్కులకు గాను 607 మార్కులు సాధించడం విశేషం. 99 పైచిలుకు ఫిజిక్స్, కెమిస్ట్రి, బయాలజీ సబ్జెక్టులలో సాధించడం విశేషం. సాయివర్ధన్ ఇంటర్మీడియెట్ 2023-27 సంవత్సరంలో విజయవాడలోని గోకాలైట్స్ అకాడమీలో పూర్తి చేశాడు. ఇంటర్‌లో 981 మార్కులు, పదవ తరగతిలో 585 మార్కులతో తన ప్రతిభా పాటవాలను ప్రదర్శిస్తున్నాడు. సాయివర్ధన్ విజయంపై అనేక మంది అభినందనలు తెలుపుతున్నారు.

వెంకటేశ్వర కళ్యాణానికి వేలాదిమంది భక్తులు

విశాలాంధ్ర-పోలాకి: పోలాకి పంచాయతీ గంటపేట గ్రామంలో వెలసియున్న శ్రీశ్రీశ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ఎనిమిదో వార్షికోత్సవం సందర్భంగా వేలాదిమంది భక్తుల మధ్య బాల సరస్వతి దంపతులిచే స్వామి వారి కళ్యాణ మహోత్సవం నిర్వహించినట్లు రాష్ట్ర బీసీ విద్యుత్ ఉద్యోగ రాష్ట్ర అధ్యక్షులు మరియు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆలయ ధర్మకర్త పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు విశాఖ వేద పండితుల తో స్వామి వారి కళ్యాణం మంగళ వాయిద్యాల మధ్య రంగ రంగ వైభవంగా జరిపారు. అనంతరం వేలాది మంది భక్తులకు అన్న ప్రసాదం కల్పించారు. సాయంకాలం స్వామివారి ప్రాంగణంలో భజన కార్యక్రమం నిర్వహించారు.

ఫోటో: వెంకటేశ్వర కళ్యాణం: 14ఎస్‌కెఎల్ఎం10

సారవకోట జడ్పీహై స్కూల్ ఆవరణలో యోగ మాసోత్సవం



విశాలాంధ్ర-జలుమూరు: ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల కేంద్రం సారవకోట జిల్లా పరిషత్ హై స్కూల్లో శనివారం ప్రధానోపాధ్యాయులు అధ్యక్షతన యోగా కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీడీవో వివి మురళి మహన్ కుమార్ మాట్లాడుతూ ఆరోగ్యానికి యోగా ఎంతో అవసరమని అన్నారు. ఆయనతోపాటు పంచాయతీ విస్తరణ అధికారి ప్రభాకర్ రావు, మండల విద్యాశాఖ అధికారి మద్దు వెంకటరమణ, ఎంఈఓ 2 భూలక్ష్మి, హై స్కూల్ సిబ్బంది, మండల సిబ్బంది, పలు శాఖ అధికారులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొని ఘనంగా నిర్వహించుకున్నారు.

ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం ముందంజ : ఎమ్మెల్యే గొండు శంకర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలలో సూపర్ సిక్స్‌లో భాగంగా తల్లికి వందనం హామీలను పూర్తిస్థాయిలో నెరవేర్చి చదువుకున్న అందరి పిల్లలకి ఈ పథకం అందించగలిగామని శాసనసభ్యులు గొండు శంకర్ తెలిపారు. ఏడు రోడ్ల కూడలి వద్ద ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాల కుటుంబాల్లో ఈ తల్లికి వందనం పథకం ఎంతో మేలు చేస్తుందని ఎన్నికల హామీల్లో భాగంగా ఆ కుటుంబంలో ఎంత మంది పిల్లలు చదువుకుంటే వాళ్లందరికీ తల్లికి వందనం పథకం గుర్తింపు చేస్తామని మా నాయకుడు నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని పూర్తిస్థాయిలో అమలు చేశారని అన్నారు. ఈ పథకం ద్వారా ఎన్నో కుటుంబాలు ఆర్థిక స్వావలంబన పొందాలని పిల్లల్ని చదివించుకునేందుకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుందని తల్లిదండ్రులు ఆనంద వ్యక్తం చేస్తున్నారని శంకర్ తెలిపారు. అటువంటి మహానాయకుడు వద్ద శాసన సభ్యునిగా పనిచేయడం గర్వకారణంగా ఉందని, ఇచ్చిన హామీలు సూపర్ సిక్స్ పూర్తిస్థాయిలో అమలు చేయగలిగామని ఇది రాష్ట్ర చరిత్రలోనే ఓగొప్ప విషయమని తెలిపారు. తల్లికి వందనం పథకం ద్వారా తల్లిదండ్రులకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. ఎన్నో లక్షల కుటుంబాలు ఈ పథకం ద్వారా మేలు జరుగుతుందని రాష్ట్ర ప్రజలు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు స్వాతి శంకర్, తెలుగుదేశం పార్టీ శ్రేణులు కార్యకర్తలు తల్లితండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారు?

- ఎన్నికల ప్రచారంలో కూటమి నాయకుల హామీ లు ఏమైనట్లు
- ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మొజ్జాడ యుగంధర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ ప్రచార కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో అనేక మంది నిరుద్యోగులు ఉన్నారని , ఆ నిరుద్యోగులకు ప్రతినెలా నిరుద్యోగ భృతి రూ. 3 వేలు ఇస్తామని హామీ ఇచ్చిన నేపథ్యంలో ఇంతవరకు ఏ నిరుద్యోగికి కూడా నిరుద్యోగ భృతి ఇవ్వకపోవడాన్ని ఏమనాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మొజాడ యుగంధర్, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాస్‌లు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. స్థానిక ఎన్ఆర్ దాసరి క్రాంతిభవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగ యువతక నిరుద్యోగ భృతి చెల్లిస్తామని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాట ఇచ్చి మాయ చేశారన్నారు. నిరుద్యోగ యువకుల ఓట్లతో అధికారం చేజిక్కించుకున్న కూటమి ప్రభుత్వం నిరుద్యోగుల ఆశల మీద నీళ్లు చల్లారన్నారు. ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం గడిచినా నేపథ్యంలో సంబరాలు చేసుకుంటున్న కూటమి ప్రభుత్వం, ఏమి సాధించారో చెప్పి సంబరాలు చేసుకోవాలన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా నిరుద్యోగుల ఊసే ప్రభుత్వం ఎత్తని పరిస్థితి ఉందని, రాష్ట్రంలో 18 నుండి 50 సంవత్సరాల మధ్య వయసు వారిలో ఏ ఉపాధి లేనివారు ఒక కోటి 56 లక్షల మంది ఉన్నట్లు ప్రభుత్వ గణాంకాలు తెలియజేస్తున్నాయన్నారు. ఇంతమంది నిరుద్యోగులు ఉన్న రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించవలసిన పరిస్థితి రాష్ట్ర ప్రభుత్వానికి ఉందన్నారు. మరో ప్రక్క రాష్ట్ర ప్రభుత్వ శాఖలలో లక్షలాది పోస్టులు ఖాళీగా ఉన్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేసి ఉద్యోగాలు కల్పించవలసిన పద్ధతి ప్రభుత్వానికి లేదని అన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించి, నిరుద్యోగ భృతిని ఇవ్వాలని లేనిపక్షంలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ప్రత్యక్ష ఆందోళనకు పిలుపునిస్తామని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు ఆర్.అరవింద్, వై.వేణు, ఏ.రాము, ఎస్.రామోజీ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం

- ఆంధ్రప్రదేశ్ బీసీ యాదవ సంక్షేమ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ ఇప్పిలి జగదీశ్వరరావు

విశాలాంధ్ర-టెక్కలి: ఎన్నికలలో మేనిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమం మరియు అభివృద్ధి ఒక్క కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఆంధ్రప్రదేశ్ బీసీ యాదవ సంక్షేమ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ ఇప్పిలి జగదీశ్వరరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉమ్మడి కూటమి ప్రభుత్వం గా ఏర్పడిన తరువాత రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తనకున్న అపారమైన అనుభవంతో సూపర్ సిక్స్ హామీలు ఇప్పటికే 70 శాతం అమలు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మ్యానిఫెస్టోలో చెప్పినట్టుగా 3000 పెన్షన్ 4000 చేశారని, ఇచ్చిన మాట ప్రకారం మూడు నెలలు బ్యాలెన్స్ 3000 కలిపి 7000 చెల్లించారని గుర్తు చేశారు. ఒక సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్ల మాట నిలబెట్టుకున్నారని అన్నారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా టెక్కలి నియోజకవర్గానికి ప్రాధాన్యతనిస్తూ రావివలస గ్రామాన్ని ఒక పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని అభివృద్ధి పదంలో అడుగులు వేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. త్వరలోనే రావివలస గ్రామం అభివృద్ధితో రూపురేఖలు మారిపోతాయని అన్నారు. అలాగే నారా లోకేష్ అధ్యక్షతన తల్లికి వందనం అమలు చేశారని, త్వరలో మిగిలిన హామీలు కూడా అమలు చేస్తారని అన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు టెక్కలి నియోజకవర్గంలో ఒకపక్క సంక్షేమం, మరోపక్క అభివృద్ధిని చేసేందుకు అనుక్షణం కృషి చేస్తున్నారని, త్వరలోనే ప్రతి గ్రామానికి రహదారులు, త్రాగునీరు, డ్రైనేజీలు వంటి పనులతో గ్రామాల రూపురేఖలు మారుస్తారనే నమ్మకం ప్రజల్లో ఉందని దానికి అనుగుణంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుందని తెలిపారు. రావివలస గ్రామంలో ఉన్న స్వయంభూలింగం శ్రీశ్రీశ్రీ ఎండల్ల మల్లికార్జున స్వామి పుణ్యక్షేత్రాన్ని రాష్ట్రంలోనే ఉన్నతమైన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని, ఈ క్షేత్రానికి అతి దగ్గరగా వున్న తెలినీలాపురం విదేశీ విహంగల కేంద్రం, భావనపాడు,మూలపేట పోర్ట్ అన్నింటిని కలుపుతా ఈ పుణ్యక్షేత్రం రూపురేకలు మార్చాలని మంత్రి పనిచేస్తున్న విషయం విదితమే అందుకు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కు ప్రజల తరఫున కృతజ్ఞతలు, ధన్యవాదములు తెలుపుతున్నామన్నారు. కూటమి ప్రభుత్వం పరిపాలన కోసం ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉందని, ప్రతి ఒక్కరూ పార్టీ కోసం సమన్యాయంతో ముందుకు వెళ్లాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

ఆదర్శ పాఠశాలల్లో నిరంకుశ బదిలీలు..

- లబోదిబోమంటున్న ఉపాధ్యాయులు
- ఎస్టీయు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ రమణమూర్తి

విశాలాంధ్ర-ఆమదాలవలస : ఆదర్శ పాఠశాలల్లో బదిలీలను ప్రభుత్వం నిరంకుశ ద్వారానిగా నిర్వహిస్తుందని ఎస్ టి యు జిల్లా అధ్య క్షులు ఎస్వి రమణమూర్తి అన్నారు. ఆయన ఒక ప్రక టన విడుదల చేస్తూ అర్ధరాత్రి జూన్ 12వ తేదీన బది లీల జీవో విడుదల చేశారని, 13వ తేదీ సాయంత్రానికి అప్లికేషన్ ఎనేబుల్ చేశారని అదే రోజు అర్ధరాత్రి 12 గంటల లోపు కేవలం ఆరేడు గంటల వ్యవధిలోని బదిలీ అప్లికేషన్ సమర్పించాలని నిబంధనలు విధిం చి మెడ పై కత్తి పెట్టి బదిలీలు చేయించడం ఎంతవ రకు సమంజసం అని ప్రశ్నించారు. కనీసం స్పౌజ్ ప్రిఫరెన్షియల్ తదితర ధృవ పత్రాలు తెచ్చుకొనుటకు కూడా సమయం ఇవ్వలేదు. రెండవ శనివారం, ఆది వారం సెలవులు రావడంతో ఈధ్రువపత్రాలు తెచ్చు కోలేని పరిస్థితిలో ఉపాధ్యాయులు ఉన్నారు. 2022 సంవత్సర బదిలీలల్లో అధికంగా ఉన్న తెలుగు పీజీ టీలను అగైనెస్ట్ పోస్టుల్లో నియమించి ఇప్పుడు వారికి 5 ఏళ్ల గడువు తీరకముందే తప్పనిసరి బదిలీ కింద దరఖాస్తు చేసుకోవాలని ఆదేశించటం తో వీరు తీవ్ర మనోవేదనకు గురివుతున్నారు. ఎస్‌టియు ఆంధ్ర ప్రదేశ్ పూర్తిగా ఖండిస్తోంది. అక్టోబర్ 2023లో దాదాపు 250 మంది ఉపాధ్యాయులకు ప్రమోషన్లు కల్పిం చడం జరిగింది. వీరికి ప్రమోషన్లు చేపట్టినప్పుడు రెగ్యులర్ పోస్టుల్లో ఉన్న కాంట్రాక్టు ఉపాధ్యాయులను నిబంధనల ప్రకారం ఖాళీగా చూపించలేదు. అందు వలన చాలామంది సుదూర మారుమూల ప్రాంతా లకు వెళ్ళవలసి వచ్చింది . అప్పటి జెడి రాబోయే బదిలీల్లో వీరికి తప్పకుండా అవకాశం కల్పిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. కేవలం రెండు నెలలు తక్కువ ఉన్నదనే కారణంతో ప్రస్తుత బదిలీల్లో వీరికి అవకాశం కల్పించలేదు. ఇప్పుడున్న ఖాళీలను రాబో యే డీఎస్సీ ద్వారా భర్తీ చేస్తారు. కనుక కనీసం ఈ ఒక్కసారికైనా వారికి ఈ బదిలీలలో అవకాశం కల్పించి న్యాయం చెయ్యాలని ఆ ఉపాధ్యాయులు కోరుతున్నారు. రెగ్యులర్ పోస్టుల్లో దాదాపు 250 మంది కాంట్రాక్టు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. నిబంధనల ప్రకారం బదిలీల్లో వీరు పనిచేస్తున్న పోస్టులను రెగ్యులర్ ఉపాధ్యాయులకు ఖాళీలుగా చూపాలి. కానీ ఇప్పుడుకూడా అలా జరగలేదు. దీం తో రెగ్యులర్ ఉపాధ్యాయులు తీవ్ర ఆందోళన చెందు తున్నారు. ఇతర మేనేజ్మెంట్లలో లేని పెర్ఫార్మన్స్ పాయింట్లు ఆదర్శ పాఠశాలలకు పెట్టి ఇబ్బందులకు ఉపాధ్యాయులను గురిచేస్తున్నారు. ఈ బదిలీలకు కూడా అసంబద్ధ పాయింట్లు కేటాయించారు. ఉపా ధ్యాయులకు వ్యక్తి గత సబ్జెక్ట్ రిజల్ట్ పాయింట్లు కాకుండా మొత్తం పాఠశాల అవేరేజ్ రిజల్ట్ పాయింట్లు కేటాయించారు ఇది అనాలోచితమైన పద్ధతి. ఉదా: చిత్తూరు/అన్నమయ్య జిల్లాలో ఉన్న రొంపిచర్ల ఆదర్శ పాఠశాలలో 2024-25 విద్యాసంవత్సరానికి ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు లేరు. అయితే ఆ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు సున్న పాయింట్లు కేటాయించారు. కనీస సమయం కూడా ఇవ్వకుండా యుద్ధ ప్రాతిపదికన మూడు రోజుల్లో బదిలీల ప్రక్రియ ముగియాలంటూ ఆదేశించడం ఉపాధ్యాయులకు తీవ్ర మనస్తాపం కలుగుతుందని దీన్ని ఆంధ్రప్రదేశ్ ఎస్ టి యు తీవ్రంగా ఖండిస్తుందన్నారు.

అపోహలు వీడండి... రక్తదానం చేయండి

- అఖిలభారత చిరంజీవి యువత వర్కింగ్ ప్రెసిడెంట్ తైక్వాండో శ్రీను
- ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా రక్తదానం చేసిన మెగా అభిమానులు

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : అపోహలు వీడి రక్తదానం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని అఖిలభారత చిరంజీవి యువత వర్కింగ్ ప్రెసిడెంట్ తైక్వాండో శ్రీను పిలుపునిచ్చారు. ఆపదలో ఉన్న సాటి వారి ప్రాణాల్ని కాపాడేందుకు రక్తదానం దోహదపడుతుందన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని తైక్వాండో శ్రీను ఆధ్వర్యంలో శ్రీకాకుళం నగరంలోని న్యూ బ్లడ్ బ్యాంక్‌లో శనివారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసారు. ఈ శిబిరంలో మెగా అభిమానులు స్వచ్ఛందంగా రక్తదానం చేసారు. అఖిల భారత చిరంజీవి యువత వ్యవస్థాపక అధ్యక్షులు రవణ స్వామి నాయుడు, అధ్యక్షులు చింతామణి మహేష్ పిలుపుమేరకు శ్రీకాకుళం న్యూ బ్లడ్ బ్యాంకు మేనేజర్ మణికంత ఆధ్వర్యంలో సిబ్బంది రక్తాన్ని సేకరించారు. ఈసందర్భంగా తైక్వాండో శ్రీను మాట్లాడుతూ ప్రతీ ఏడాది వరల్డ్ బ్లడ్ డోనర్ డేను ఒక్కో థీమ్‌తో నిర్వహిస్తుంటారు ఈ ఏడాది రక్తమివ్వండి... నమ్మకం ఇవ్వండి అన్న థీమ్‌తో దినోత్సవాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. బ్లడ్ డొనేషన్ ద్వారా రక్తాన్ని ఇస్తే తోటివారికి నమ్మకాన్ని ఇచ్చినట్టే... వాళ్ల ప్రాణానికి మన ప్రాణాన్ని అడ్డు వేస్తామన్న భరోసాని నింపినట్టే అన్నదే దాని అర్థమన్నారు. రక్తదానం పట్ల ప్రజలలో అపోహలు ఉన్నాయన్నారు. 18-60 ఏళ్ళ మధ్య వయస్సు గల ఆరోగ్యంగా ఉన్న వారందరూ కూడా రక్తదానం చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మెగా స్టార్ చిరంజీవి, పవర్ స్టార్ పవన్ కళ్యాణలతో పాటు మెగా ఫ్యామిలీ అభిమానులు వైశ్యరాజు మోహన్, మజ్జి గౌతమ్, పుక్కళ్ళ నవీన్ కుమార్, గొర్లె కిరణ్ కుమార్, సంతోష్, జోగిపాటి వంశీ,కెల్ల గిరి, పెయ్యల చంటి, అబ్బాస్, కిరణ్ రెడ్డి, విజయ్, సీర రాజు, గుజ్జల తేజ, పవన తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న గేదెలు స్వాధీనం

విశాలాంధ్ర-కవిటి: కోటబొమ్మాళి మండలం నారాయణవలసకు చెందిన దాకర ప్రకాశరావు ఒడిశాలోని గొలంత్ర గ్రామం నుంచి మహింద్రా లగేజీ వాహనంలో 6 గేదెలను తిలారు సంతకు అక్రమంగా తరలిస్తుండగా కవిటి మండలం కొజ్జిరియా ఫ్లైఓవర్ వద్ద ఉదయం 6 గంటల సమయంలో కవిటి పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో వాహనాన్ని సీజ్ చేసి గేదెలను కొత్తవలస హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థకు అప్పగించారు. ముగ్గురుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవివర్మ తెలిపారు.

కొమినేనిని జగన్ సమర్థించడం హాస్యాస్పదం

- తెలుగు మహిళా అధ్యక్షురాలు గోండు స్వాతి శంకర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్: మహిళల పట్ల అసభ్యకరంగా మాట్లాడిన కొమినేని శ్రీనివాసరావు బెయిల్ రావడం, దాన్ని వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి సమర్థించడం హాస్యాస్పదంగా ఉందని శ్రీకాకుళం నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు గోండు స్వాతి శంకర్ అన్నారు. కామినేని బెయిల్ ను నిరసిస్తూ ఏడు రోడ్ల జంక్షన్ వద్ద మహిళలు పెద్ద సంఖ్యలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలపై అసభ్యకర పదజాలం తో అమర్యాద గా మాట్లాడటం దాని సమర్థించుకోవడం జగన్మోహన్ రెడ్డికి ఎంతవరకు సమంజసం అని దాని పునరాలోచించుకుని తెలుగు మహిళలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే మహిళలు బుద్ధి చెప్పారని ఇంకా ఉన్న విలువలను పోగొట్టుకోకుండా గౌరవప్రదంగా ఉండడం నేర్చుకోవాలని హితవు పలికారు. నిందితులను వెనకేసుకు రావడం హా స్యాస్పదమని, ఇప్పటికే తెలుగు మహిళల ఆగ్రహానికి గురయ్యారని, ఇప్పటికైనా తెలుసుకోవాలని తెలిపారు. ప్రవర్తనలోన మాట తీరులోన మార్పు రాకపోతే రాబోయే రోజుల్లో మరింత గుణపాఠం చెప్పవలసి ఉంటుందని ఇ ప్పటికైనా తెలుగు ప్రజల ఆత్మ గౌరవాన్ని కాపాడే విధంగా ప్రయత్నం చేయాలని, అన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు మెట్ట సుజాత, తెలుగు మహిళ కార్యకర్తలు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కుర్మా గ్రామంలో అగ్ని ప్రమాద ఘటన స్థలాన్ని ఎమ్మెల్యే ఎంజీఆర్ పరిశీలన

విశాలాంధ్ర-హిరమండలం : మండలంలోని అంతకా పల్లి గ్రామపంచాయతీలో ఆధ్యాత్మికంగా భారతీయ సంస్కృతి సాంప్రదాయాలకు అనుగుణంగా ప్రకృతి సేద్యం చేస్తూ రాధాకృష్ణ పారాయణం పఠిస్తున్న కుర్మా గ్రామంలో ఇటీవలే సంభవించిన అగ్ని ప్రమాద విషయాన్ని తెలుసుకొన్న పాతపట్నం నియోజవర్గం శాసనసభ్యులు మామిడి గోవిందరావు ఘటన స్థలాన్ని శనివారం పరిశీలించారు. అనంతరం అయన మాట్లాడుతూ అగ్ని ప్రమాద స్థలాన్ని పరిశీలించి నివేదికను త్వరితగతిన ఉన్నత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం తన వంతు సహాయ సహకారాలు ఉంటాయని తెలియజేశారు. కార్యక్రమంలో తహాసీల్దార్ ఎన్ హనుమంత్‌రావు, ఎంపీపీ ప్రతినిధి తూలుగు తిరుపతి రావు మాస్టర్,జడ్పీటీసీ పొగిరి బుచ్చి బాబు, మండలటీడీపీ అధ్యక్షులు వై నాగేశ్వర రావు, పోతూ రాజు శ్రీధర్, పిన్నింటి అప్పన్న రెడ్డి, సర్పంచ్ దారపు ఢిల్లేశ్వర్, ఎన్ సాయి కృష్ణ,చందకనాగరాజు, కే శశి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా చాపర సుధాకర్

విశాలాంధ్ర-ఆమదాలవలస : ఆమదాలవలస పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు, టిడిపి సీనియర్ నాయకులు డాక్టర్ చాపర సుధా కర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ గా నియమితులయ్యారు. విజయవా డలోని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీకి ప్రభుత్వం 8 మంది సభ్యులతో కూడిన కొత్త ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ నియా మకానికి సీఎం చంద్రబాబునాయుడు ఆమోదించా రు. ఈ నియామకంలో శ్రీకాకుళం జిల్లా నుంచి ఆము దాలవలసకు చెందిన సుధాకర్ డాక్టర్ ఎంపికయ్యా రు. రాష్ట్రస్థాయిలో హెల్త్ యూనివర్సిటీ కి జిల్లాకు చెందిన సుధాకర్ ను ఎంపిక చేయడం, జిల్లాకు మొద టసారిగా ఈ అవకాశం కల్పించారు. ఈ నియామకం పట్ల సీఎం చంద్రబాబు నాయుడుకు, మంత్రి లోకేష్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్, ఎమ్మెల్యే, పియుసి చైర్మన్ కూన రవికుమార్ కు డాక్టర్ సుధా కర్ ధన్యవాదములు తెలియజేశారు. తనపై ఎంతో నమ్మకంతో అప్పగించిన ఈ బాధ్యతలను యూనివ ర్సిటీ కృషి చేస్తానని డాక్టర్ తెలియజేశారు.

జిల్లా ఆసుపత్రి రహదారిలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయండి

విశాలాంధ్ర-టెక్కలి: మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి రహదారిలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని బిజెపి నాయకులు శనివారం పంచాయతీ ఈవోకి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు ఈవో తో మాట్లాడుతూ జిల్లా ఆస్పత్రికి ప్రతిరోజు వందలాదిమంది రోగులు వస్తుంటారని, రాత్రి సమయాలలో అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రికి రావాలంటే విద్యుత్ లైట్లు లేకపోవడంతో అనే ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఇటీవల వర్షాలు కురవడంతో ఆ రహదారిలో విష సర్పాలు క్రిమి కీటకాలు దర్శనం ఇవ్వడంతో రోగుల కుటుంబీకులు రాత్రి సమయంలో బయటికి రావాలంటే భయాందోళన చెందుతున్నారని ఈఓకి వివరించారు. ప్రజలు పడుతున్న సమస్యలపై స్పందించి వెంటనే పరిశీలించి ఆసుపత్రి రహదారిలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని బిజెపి నాయకులు మోర్చ జిల్లా అధ్యక్షులు జన్ని పరమేశ్వరరావు, స్వచ్ఛభారత్ జిల్లా కన్వీనర్ చిట్టిబారికి లింగరాజు కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు.

విద్యార్థులకు యోగ దినచర్య కావాలి : కమిషనర్ బాలాజీ ప్రసాద్

విశాలాంధ్ర-ఆమదాలవలస: చిన్నతనం నుంచి ప్రతి ఒక్కరూ యోగ చేయాలని, అది దినచర్య కావాలని మున్సిపల్ కమిషనర్ పూజారి బాలాజీ ప్రసాద్ అన్నారు. అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆముదాల వలసల ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రాంతంలో గల సిద్ధార్థ పారిశ్రామిక శిక్షణ కేంద్రం లో యోగాంధ్ర కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సి పల్ కమిషనర్ పి. బాలాజీ ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరు అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ విద్యార్థులందరూ ప్రతి రోజూ యోగా చేయా లని, జీవితం లో ఒక దినచర్యగా అలవరుచు కోవా లని అని, అప్పుడే ప్రశాంతంగా ఉంటదని అన్నారు. యోగాతో ఏకాగ్రత వస్తుందని అప్పుడు ఆలోచనలకు నైపుణ్యత ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సిద్ధా ర్థ పారిశ్రామిక శిక్షణ కేంద్రం కరస్పాండెంట్ రమేష్, సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.

ఘనంగా ముగిసిన సీపీఐ జిల్లా 25వ మహాసభలు

విశాలాంధ్ర -శ్రీకాకుళం టౌన్: పాతపట్నం మండల కేంద్రంలో రెండు రోజులపాటు జరిగిన సిపిఐ జిల్లా మహాసభలు ఘనంగా ముగిసాయని సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ అన్నారు. స్థానిక సిపిఐ పార్టీ ఆఫీసులో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో వెంకటరమణ మాట్లాడుతూ పాతపట్నంలో జరిగిన సిపిఐ 25వ జిల్లా మహాసభలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగిందని, భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జిల్లా కార్యదర్శిగా చాపర వెంకటరమణ ను ఎన్నుకోవడం జరిగిందన్నారు. జిల్లా సహాయ కార్యదర్శిగా లండ వెంకట్రావును ఎన్ను కోవడం జరిగిందన్నార. నూతన జిల్లా కార్యవర్గ సభ్యులుగా చాపర సుందర్లాల్, కొన్న శ్రీనివాస్, ఎస్ నారాయణస్వామి, పి. అరేలమ్మ, ఎస్ హరికృష్ణ, బి సంతోష్ లను జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకోగా, వీరితోపాటు 31 మంది సమితి సభ్యులుగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. జిల్లాలో ఉన్న ప్రతి సమస్యల పరిష్కారానికి భారత కమ్యూనిస్టు పార్టీ పనిచేస్తుందన్నారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మొజ్జాడ యుగంధర్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొన్న శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు హైస్కూల్ లో యోగాసనాలు

విశాలాంధ్ర-కొత్తూరు : కొత్తూరు ప్రభుత్వా హైస్కూల్ లో. శనివారం విద్యార్థులు యోగాసనాలు చేశారు పిఎం.నరేంద్ర.మోడీ పిలుపుమేరకు.మే నెల 21తేది నుండి జూన్ 21 తేది వరకు నెల రోజుల పాటు యోగా మాసోత్సవాలు ను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించంది. ఇందులోభాగంగా వివిధ పాఠశాల ల్లో గ్రామాల్లో యోగావస్యకత ను ర్యాలీలు , సమావేశాలు , కరపత్రాలు ద్వారా .ప్రజలకు వివరిస్తున్నారు.

జీడి రైతులను పట్టించుకోని పాలకులు..హామీలతో టోపీ..

గిట్టుబాటు ధర లేక జీడి రైతులకు కష్టాలు..!

విశాలాంధ్ర-పలాస: ఉద్దానం జీడి రైతాంగం అధిక వడ్డీలకు అప్పులు చేసి పంట దిగుబడులు కోసం పెట్టుబడులు పెట్టి ఎండనక, వాననక, రేయనక, పగలనక ఆరుగాలం అహర్నిశలు శ్రమిస్తున్న గిట్టుబాటు ధర దక్కడం లేదని జీడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏడాది జీడి పంట దిగుబడి సమయంలో జీడి వ్యాపారులు రైతులకు ఇబ్బందులు పాలు చేసే విధంగా చర్యలు చేపడుతుండడం వారి చర్యలకు ప్రజాప్రతినిధులు మద్దతు పలకడం ఇక్కడ ఆనవాయితీగా మారింది. శ్రమకు తగ్గ ప్రతిఫలం దక్కకపోవడంతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో వక్క ఉద్దానం గ్రామాల్లో కిడ్నీ బాధితులు ప్రతి పంచాయతీలను వందలాదిమంది ఉన్నారు. కిడ్నీ వ్యాధి బారిన పడి మృత్యువాత పడుతున్నారు. పండిస్తున్న జీడి కొబ్బరి పంటలకు మరియు అంతర పంటలకు గిట్టుబాటు ధర దొరకక అప్పులతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని కిడ్నీ వ్యాధితో బాధపడుతూ వేలాది రూపాయలు మందుల కోసం వెచ్చిస్తున్నామని జీడి కొబ్బరి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు ప్రజా ప్రతినిధుల భరోసా కరువైందని దీనికి బాధ్యులైన అధికారులు పట్టించుకోవడంలేదని వాపోయారు.ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం వల్ల వ్యాపారుల దోపిడీకి గురవుతున్నామని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారులు చట్ట విరుద్ధంగా విదేశాల నుంచి జీడి పిక్కలు ఇక్కడ పరిశ్రమలకు దిగుమతి చేస్తున్న అధికారులు పట్టించుకోక వ్యాపారుల వైపే మద్దతు పలుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

పలాస నియోజకవర్గ పరిధిలో పలాస, వజ్రపుకొత్తూరు, మందస మండలాల్లో ఉద్దానం, గిరిజన ప్రాంతాల్లో వేలాది ఎకరాల్లో రైతాంగం జీడి పంటను పండిస్తున్నారు. ఉద్దానం రైతుకు జీడి, కొబ్బరి పంటే ప్రధాన జీవనాధారం. ప్రభుత్వ పరంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని దశాబ్దాల తరబడి జీడి, కొబ్బరి రైతులు ఆందోళనలు చేస్తున్నా కాని పాలకులు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తున్నారు. దీంతో రైతాంగానికి గిట్టుబాటు ధర లేక వ్యాపారులు, దళారులు దోపిడికి గురవుతున్నారు. ఏళ్ల తరబడి 80 కేజీల జీడి పిక్కల బస్తా ధర పదివేల రూపాయల వరకు ఉద్దానం రైతుల నుంచి వ్యాపారులు కొనుగోళ్లు చేసే వారు. 2017, 2018 సంవత్సరాల్లో 80 కేజీల జీడి పిక్కలను 13వేల రూపాయలకు వ్యాపారులు కొను గోలు చేశారు. 2019-20లో 9వేల రూపాయలు, 2021లో 8,600 రూపాయలు 2022లో 11000 వేల రూపాయలు,2023లో 8000 వేల రూపాయలు, 2024లో 13,500 రూపాయలు, ప్రస్తుతం ఈ ఏడాది వ్యాపారులు రైతుల నుంచి జీడి పిక్కలను కొనుగోళ్లు చేయడానికి ప్రయత్నాలు ప్రారంభించలేదు. జీడి పప్పుకు గిరాకీ లేదని, మార్కెటింగ్ సదుపాయాలు లేవనే పేరుతో స్థానికంగా లభ్యమయ్యే జీడి పిక్కలను కొనుగోలు చేయకుండా విదేశీ పిక్కలను అధిక శాతం దిగుమతి చేస్తున్నారు. దీంతో రైతాంగం ఇళ్ల వద్ద జీడి పిక్కలు నిల్వ ఉండిపోయాయి. దీంతో రైతాంగంలో దిక్కు తోచని పరిస్థితులు చోటుచేసుకున్నాయి. కాగా

2018 అక్టోబరు 10న సంభవించిన తిత్లీ తుఫాన్ తో కొబ్బరి పంట ధ్వంసమైంది. 90 శాతం వరకు కొబ్బరి చెట్లు నేలకులాయి. అప్పట్లో నేల కూలిన జీడి చెట్లు, పక్కకు ఒరిగిపోయిన చెట్లను మళ్లీ బతికించే విధంగా రైతులు సంరక్షణ చేశారు. అప్పట్లో జీడి మొక్కలు కూడా రైతులు డబ్బులు చెల్లించి కొనుగోలు చేశారు. జీడి తోటలు పెంపకం కోసం రైతులు ఎంతో శ్రమపడ్డారు. కాని రైతులు పండించే పంటకు వ్యాపారులు ధర నిర్ణయించే పరిస్థితి నెలకొంది. దీంతో జీడి రైతుల శ్రమ దోపిడి అవుతుంది. ఒక ఎకరా జీడి తోటకు ప్రభుత్వం, ఉద్యానవన శాఖ అంచనా ప్రకారం ఆరు బస్తాలు జీడి పిక్కలు పంట దిగుబడి రావాలి. ఈ విధంగా పంట దిగుబడులు రావాలంటే వాతావరణం అనుకూలంగా ఉండాలి. కాని ప్రతీ ఏడాది ప్రకృతి వైపరీత్యాలు వెంటాడుతుండడం, పెను తుఫాన్ లు వెంటాడి పంట దిగుబడులు పూర్తిగా పడిపోయాయి. ఈనేపథ్యంలో ఒక్కొక్క ఏడాది ఎకరాకు ఒకటి, రెండు బస్తాలు కూడా పండని పరిస్థితులు ఉన్నాయి. ప్రతీ ఏడాది జీడి పంటకు అగ్గి తెగుళు ,, టీ దోమ వంటివి సోకి పంటను నాశనం చేస్తున్నాయి. ఉద్యానవన శాఖ కనీసం సూచనలు లేవు. జీడి పంట అభివృద్ధి కోసం రైతుల బాగోగుల కోసం ప్రణాళికలు లేవు

శ్రమ జీవులు ఉద్దానం రైతులు:

ఒక ఎకరా జీడి తోటకు దుక్కి, కంచె నిర్మాణం, తోట పరిశుభ్రత, తోట సంరక్షణ కోసం

వివిధ రకాల మందులు కొనుగోలు చేసేందుకు, కూలీలతో జీడి తోట పనులు చేయించేందుకు 40 నుంచి 50వేల రూపాయలు వరకు జీడి రైతులు పెట్టుబడి పెడుతున్నారు. పెట్టుబడి పెట్టిన ఈ డబ్బులు అధిక వడ్డీలకు షాహుకార్ల వద్ద, ఫైనాన్స్ వ్యాపారులు వద్ద అప్పులు చేస్తారు. వీరి వద్ద అప్పు దొరకకపోతే భూమి, బంగారం తదితర ఆస్తులను తనఖా పెడుతుంటారు. తోట సంరక్షణ కోసం ఇంటిల్లపాది ఆరుగాలం నిరంతరం శ్రమ పడతారు, ప్రకృతి సహకరిస్తేనే అధిక పంట దిగుబడులు ఉంటాయి. దిగుబడి అయిన పంటకు గిట్టు బాటు ధర లభిస్తేనే శ్రమకు తగ్గ ప్రతిఫలం లభిస్తుంది. ప్రభుత్వ లెక్కలు ప్రకారం ఎకరా జీడితోటకు 6 బస్తాలు జీడి పిక్కలు దిగుబడి రావాలి. ఈ లెక్కన చూసిన 6 బస్తాలు అమ్మితే ప్రస్తుత రేట్లు ప్రకారం కేవలం 81వేల రూపాయలు రైతులకు దక్కుతుంది. ప్రకృతి వాతావరణం సహకరిస్తేనే ఈ విధంగా జీడి పిక్కలు పంట దిగుబడి అవుతుంది. రైతాంగం పెట్టిన పెట్టుబడులకు తగ్గట్టుగా జీడి పిక్కలకు మద్దతు ధర లభిస్తే లాభాలు వస్తాయి. మద్దతు ధర లేకపోతే నష్టాలే చవి చూడాల్సి వస్తుంది. ప్రభుత్వ పరంగా కొనుగోలు కేంద్రాలు కూడా లేవు. భారత దేశంలోను, ప్రపంచ దేశాల్లో జీడి పిక్కలు ద్వారా తయారయ్యే ఇక్కడి జీడిపప్పుకు ఎంతో పేరు ఉంది. పేరుకు తగ్గట్టుగా డిమాండ్ కూడా ఉంది. ప్రస్తుతం జీడి మద్దతు ధర 16 వేల రూపాయలు ప్రకటించాలని రైతులు పోరాటం చేస్తున్నారు. ప్రభుత్వం తక్షణం స్పందించి తమను ఆదుకోవాలని జీడి రైతులు కోరుతున్నారు.

రక్తదానానికి ముందుకు రావాలి

కాశీబుగ్గ డిఎస్పి అప్పారావు

విశాలాంధ్ర-పలాస: రక్తదానంకు ప్రతీ ఒక్కరూ ముందుకు రావాలని కాశీబుగ్గ డిఎస్పీ వి.వెంకట అప్పారావు అన్నారు. శనివారం ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా పలాస క్యాష్యు లేబర్, రైస్ మిల్లర్స్ కార్మికుల భవనం వద్ద ఆ నలుగురు ట్రస్ట్ అద్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని కాశీబుగ్గ డిఎస్పి వెంకట అప్పారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకరి రక్తదానం మరోకరికి ప్రాణం పోస్తుంది అంటే ఆ కుటుంభానికి వెలుగునిస్తుందన్నారు. గతంలో రక్తదానంపై ఎన్నో అపోహాలు ఉండేవని, ప్రస్తుతం రక్తదానం చేసేందుకు చాలామంది ముందుకు రావడం శుభ పరిణామమని అన్నారు. ఆ నలుగురు ట్రస్ట్ అద్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి యువత సచ్చందంగా ముందుకు రావడం ఎంతో ఆనందకరంగా ఉందన్నారు. ఆ నలుగురు ట్రస్ట్ ఇటువంటి మంచి కార్యక్రమాలు చేపట్టం అభినందనీయమన్నారు. ఈ శిబిరంలో 20 మంది తమ రక్తం దానం చేసి ప్రాణదాతలుగా నిలిచారు. ఈ కార్యక్రమంలో సానా ఈశ్వరరావు, టెంక తేజేశ్వరరావు, రాజు, నరేష్, మన్మధ, వేణు, క్యాషు లేబర్ యూనియన్ అధ్యక్షులు అంబటి క్రిష్ణమూర్తి, సింహాచలం, రాము, నాగేశ్వరరావు, మోహన్, ప్రాణదాత బ్లడ్ బ్యాంక్ మేనేజర్ సాయి, సిబ్బంది పాల్గొన్నారు.

యోగాతో మానసిక ఉల్లాసం

పలాస ఎంపీడీవో వసంత కుమార్

విశాలాంధ్ర-పలాస: యోగాతో మానసిక ఉల్లాసం కలుగుతోందని పలాస ఎంపీడీఏ వసంత కుమార్, అయూస్ వైద్యాధికారి దుర్గాప్రసాద్ లు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పలాస మండలం రెంటికోట సచివాలయం ఆవరణలో యోగ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వసంత్ కుమార్, అయూస్ వైద్యాధికారి దుర్గాప్రసాద్ లు మాట్లాడుతూ భారతదేశం వేద భూమి అని, ప్రాచీన కాలం నుండి యోగ ప్రాచుర్యం పొందింది అన్నారు. యోగతో శరీరంలో ఉన్న అన్ని రుగ్మతలు తొలగిపోతాయని ప్రతి ఒక్కరూ గంట పాటు యోగ చేయాలని సూచించారు. యోగాతో మానసిక, శారీరక ఒత్తిళ్లను జయించి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించవచ్చని చెప్పారు. ప్రతి ఒక్కరూ చిన్నప్పటి నుండి యోగాభ్యాసాన్ని అలవాటుగా మార్చుకొని నిరంతర సాధన చేయాలని అన్నారు. నేటి జీవన విధానంలో నిత్యం అధిక ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నామని, తద్వారా అనారోగ్యానికి గురయ్యే ప్రమాదముందన్నారు. ఇటువంటి తరుణంలో యోగా చక్కని పరిష్కారమని చెప్పారు. యోగా వల్ల నూతనోత్తేజం లభిస్తుందని, దీనివల్ల మరింత ఉత్సాహంగా పనిచేసేందుకు అవకాశం కలుగుతుందన్నారు. అనంతరం వీరితో పాటు అధికారులు యోగాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఈ ఓ ఆర్ డి వైకుంఠ రావు, రెంటికోట పంచాయతీ కార్యదర్శి సద్గుణబాబు, సచివాలయ సిబ్బంది, మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం కూలీ మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పతనం అంచున ప్రభుత్వ పాఠశాలలు...

డిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారావు

విశాలాంధ్ర-ఆమదాలవలస: జగన్ మారి బాబు వస్తే ప్రభుత్వ పాఠశాలల ప్రభుత్వ ఉపాధ్యాయుల పరిస్థితి మెరుగుపడుతుందని ఆశిం చిన ఉపాధ్యాయ, విద్యాభిమానులకు కూటమి ఏడా ది పాలన నిరాశ పరిచింది అని డి టి ఎఫ్ జిల్లా ప్రధా న కార్యదర్శి పేడాడ కృష్ణారావు అన్నారు. గత ప్రభు త్వంలో ఉన్న జీవోలు 84, 85, 117 స్థానంలో కూట మి ప్రభుత్వం తెచ్చిన 19, 20, 21 జీవోలు ప్రభుత్వ పాఠశాలలను పతనం అంచుకు తీసుకొని పోవడం జరుగుతుంది. కూటమి ప్రభుత్వ విద్యారంగ విధా నాలు కన్నా వైసీపీ ప్రభుత్వ విద్యా విధానాలే నయం అన్నట్లుగా నేటి ఉపాధ్యాయులు ఆలోచిస్తున్నారు. నిజానికి నాడు నేడు రెండు ప్రభుత్వాలు అనుస రిస్తున్న విద్యారంగ సంస్కరణలు ప్రపంచ బ్యాంకు ఆదేశి తమైన వని మనం అర్థం చేసుకుంటే తప్ప విద్యారంగ పతనం ఎందుకు జరుగుతుందో మనకు సరిగా అర్థం కాదు. గత ప్రభుత్వ ఆరు రకాల బడు లను కూటమి ప్రభుత్వం తొమ్మిది రకాల బడులు చేసింది. మూడు,నాలుగు,ఐదు తరగతులను గత ప్రభుత్వం ఉన్నత పాఠశాలలో కలిపితే, నేటి కూటమి ప్రభుత్వం మూడు, నాలుగు, ఐదు తరగతులను మోడల్ ప్రాథమిక పాఠశాలల్లో కలిపింది. ఇక మాతృ భాషా మాధ్యమం తొలగింపు, ఫౌండేషన్ పాఠశాలల కొనసాగింపు, ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తిని పెంచ డం, ప్రాథమికోన్నత పాఠశాలల కుదింపు, సక్సెస్ ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టుల తగ్గింపు ను కూటమి ప్రభుత్వం యధావిధిగా కొనసాగిస్తూనే, అదనంగా పిఎస్ హెచ్ఎం పోస్టుల్లోనూ, క్లస్టర్ ఉన్నత పాఠశాలల్లో నూ స్కూల్ అసిస్టెంట్ల నియామకం చేప ట్టడం జరిగింది. ఇవన్నీ పై అసంబద్ధ ప్రభుత్వ విధా నాల వలన మిగులు ఉపాధ్యాయ పోస్టులను సర్దు బాటు చేయడం గా చెప్పబడుతున్నాయి. ప్రపంచ బ్యాంకు అప్పుల షరతుల మేరకు గత, నేటి ప్రభు త్వాలు ప్రభుత్వ విద్యా రంగ బాధ్యతల నుండి క్రమ క్రమంగా తప్పు కొనే విధంగానే జరుగుతుంది. గతం లోని విజన్- 20 20 కి, నేటి విజన్ -2047 కి పెద్ద తేడా ఏమీ లేదు. అయితే పై ప్రభుత్వ విధానాలను ప్రస్తుత బదిలీల సందర్భంగా గమనించిన ఉపాధ్యా య సంఘాలు రాష్ట్రస్థాయిలో ఐక్యవేదికను ఏర్పాటు చేసి, పోరా టానికి పిలుపునివ్వడంతో ఉపాధ్యాయ వర్గాలలో ఆశలు చిగురించాయి. కానీ ఆ ఆశలను నిరాశ చేసిన రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ సంఘ నాయకత్వం ప్రపంచ బ్యాంకు విధానాల అమలకు తలవంచాయి. ఇదో చేదు నిజం. మరో విషయం ఏమిటంటే కూటమి ప్రభుత్వ ప్రస్తుత విద్యారంగ సంస్కరణల లోని ఫౌండేషన్ పాఠశాలల వలన డ్రాప్ అవుట్స్ పెరుగుతారు. సమాంతర మాధ్యమం లేకపోవడం వలన, విద్యార్థి ఉపాధ్యాయ నిష్పత్తి సంఖ్య పెంచడం వలన, ఉపాధ్యాయ పోస్టులు గణనీయంగా తగ్గుతాయి. ఉపాధ్యాయ నియామకా లు, పదోన్నతులు భవిష్యత్తులో మృగ్యం కాబడతా యి. చివరికి ఉపాధ్యాయులు తమ నివాస స్థలానికి దగ్గరగా పని దొరికితే చాలు అన్న స్థితికి చేర్చబడ తారు. వచ్చే పది సంవత్సరాల లో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న ప్రభుత్వ విద్య అత్యంత దయ నీయ పరిస్థితికి నెట్టబడి, బడుగు,బలహీన వర్గాల పిల్లలు విద్యకు దూరం కాబడతారు. మిత్రులారా ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ కోసం మనం మన ఆర్థిక డిమాండ్లను ప్రక్కన పెట్టి, సమాంతర మాధ్య మం కోసం, విద్యార్థి ఉపాధ్యాయ నిష్పత్తి గతంలో వలే ప్రాథమిక స్థాయిలో 01: 20,ప్రాథమికోన్నత పాఠశాలలలో 01:30,ఉన్నత పాఠశాలల్లో 01: 40 కోసం డిమాండ్ చేస్తూనే, ప్రస్తుత ఫౌండేషన్ పాఠ శాలల రద్దు కోసం మనం పోరాడుతూనే, విద్యార్థుల సంఖ్య ఎక్కువగా గలప్రాథమిక పాఠశాలల్లో మోడల్ ప్రాథమిక పాఠశాలల ఏర్పాటు కోసం మనం పోరాడి నప్పుడే ప్రభుత్వ పాఠశాల విద్యను పరిరక్షించు కో గలమని, ఆ దిశగా రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ సంఘ నాయకత్వాన్ని ఆలోచించే విధంగా మనమంతా కృషి చేయాలని ఆశిస్తున్నారు.

చంద్రన్న చిత్రపటానికి పాలాభిషేకం

విశాలాంధ్ర-టెక్కలి: తల్లికి వందనం పథకం క్రింద తమ పిల్లలను చదివించటానికి తల్లులు ఖాతాల్లో ఆర్థిక చేయూత ఇచ్చిన సందర్భంగా మేజర్ పంచాయతీ చిన్న చేరి వీధిలో సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతూ ఆయన చిత్రపటానికి మండల టిడిపి అధ్యక్షులు బగాది శేషగిరిరావు ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు తల్లిదండ్రులు మాట్లాడుతూ తల్లికి వందనం పథకం కింద ఆర్థిక చేయూతనవ్వడం చాలా ఆనందంగా ఉందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కోళ్ల కామేష్, లక్ష్మి పార్వతి, బెహర కాళీ, కృష్ణవేణి,దల్లి ప్రసాద్ రెడ్డి, లైశెట్టి దుర్గారావు,ప్రఫుల్ల పరిడ,మామిడి నారాయణ, వెంకటేష్ మరియు టెక్కలి పట్టణ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

యోగాసనాలు జీవితంలో భాగం కావాలి

విశాలాంధ్ర-కవిటి: యోగాసనాలు జీవితంలో భాగం కావాలని వక్తలు అన్నారు.ఈ మేరకు శనివారం జగతి పాఠశాలలో విద్యార్థులచే యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రతి రోజు ఇంటి వద్ద యోగాసనాలు చేసుకోవడం ద్వారా ఆరోగ్యం మెరుగుపరచుకోవచ్చునని చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవి, విఆర్ఓ బీరేంద్ర, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ,ఆశా కార్యకర్తలు,సిఎఫ్లు,విద్యార్థులు, పాల్గొన్నారు.

బెజ్జిపుట్టుగలో... ప్రతీ రోజు యోగాసనాలు చేయడం వలన మానసిక ఒత్తిడి దూరమవుతుందని టిడిపి మండల అధ్యక్షుడు పొందల కృష్ణారావు తెలిపారు. ఈ మేరకు శనివారం బెజ్జిపుట్టుగ శ్రీ చక్ర పెరుమాళ్ళ స్వామి వారి ఆలయ ప్రాంగణంలో అలాగే గ్రామ సచివాలయం వద్ద యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా పట్ల అందరూ అవగాహన పెంచుకొని యోగాసనాలు వేయడం వలన ఆరోగ్యం మెరుగుపరచుకోవచ్చని చెప్పారు. యోగాసనాలు చేయడం వలన ఆరోగ్యంగా ఉంటామన్నారు.ప్రతి ఒక్కరూ ఇంటి వద్ద యోగాసనాలు చేయువచ్చన్నారు. యోగాసనాలు వేయడం వలన వ్యాధులు దూరమవుతాయన్నారు.ఈ కార్యక్రమంలో కార్యదర్శి చిన్నారి,వీఆర్వో బాల కృష్ణ, సచివాలయ సిబ్బంది విజయ్, రమేష్ ,కృష్ణ తది తరులు పాల్గొన్నారు. బొరివంక బొరివంక సచివాలయం ప్రాం గణంలో యోగాంధ్ర నోడల్ అధికారి బి శ్యాంసుందర్ ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమం చేపట్టారు.ఈ కార్యక్రమంలో కార్యదర్శి గుణవతి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విమాన ప్రమాద మృతులకు నివాళులు

- మృతుల కుటుంబాలకు సంతాపం తెలుపుతూ వైకాపా కొవ్వొత్తుల ర్యాలీ

- వైకాపా ఇన్చార్జి పేరాడ తిలక్

విశాలాంధ్ర-టెక్కలి: అహ్మదాబాద్ లో గురువారం జరిగిన విమాన ప్రమాదంలో 265 మంది ప్రాణాలు కోల్పోవడం చాలా బాధాకరమైన విషయం అని వైసిపి నియోజకవర్గ ఇన్చార్జ్ పేరాడ తిలక్ అన్నారు. మండలంలోని స్థానిక ఇందిరా గాంధీ కూడాలి నుండి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు వైకాపా శ్రేణులతో కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విమాన ప్రమాదంలో ఒక్కసారిగా 265 మంది మృతి చెందడం చాలా బాధాకరమని, ఈ విషాద సమయంలో వారి కుటుంబాలకు మనోధైర్యం కలగాలని కోరారు. ఈ దుర్ఘటనలో మరణించిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం కొంత సమయం వైసీపీ నేతలతో కలిసి మానవహారం చేపట్టారు. ఈ ర్యాలీలో ఆయనతోపాటు ఎంపీపీలు, సర్పంచులు, జడ్పిటిసిలు, ఎంపీటీసీలు వైసీపీ శ్రేణులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మృతులకు కన్నీటి నివాళి

విశాలాంధ్ర-కవిటి: అహ్మదాబాద్లో జరిగిన విమాన ప్రమాద దుర్ఘటనలో చనిపోయినవారికి కవిటిలో కూటమి నాయకుల ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి మృతుల ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. రెండు నిమిషాలు పాటు మౌనం పాటించారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, యుకులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే కంప్యూటర్ పరిజ్ఞానం

విశాలాంధ్ర-కవిటి: విద్యార్థి దశ నుంచే కంపూటర్ పరిజ్ఞానం అలవరుచుకొని, సాంకేతిక వైపు విద్యార్థులు అడుగులు వేయాలని బివికె జనరల్ బాడి మెంబరు గొనప దాశప్ప అన్నారు. ఈ మేరకు శనివారం భారతీయ విజ్ఞానకేంద్రం వారి అర్హ విజ్ఞాన భారతి పాఠశాలలకు రౌండ్ టేబుల్ ఇండియా, లేడీస్ సర్కిల్ ఇండియా వారి ఆర్థిక సౌజన్యంతో కవిటి బివికె అర్హ విజ్ఞాన భారతి పాఠశాలకు 10 కంప్యూటర్లు రాగా వాటిని ప్రారంభించారు. విద్యార్థులకు డిజిటల్ బోధన ప్రాధాన్యతపై వక్తలు వివరించారు. ఈ కార్యక్రమం లో కరస్పాండెంట్లు జానకిరామయ్య, బి.కృష్ణా రావు,ప్రబంధకారిణి అధ్యక్షులు యజ్ఞానంద్, బివికె ఎస్టిటెటు అధికారి డి.రమణ మూర్తి,ప్రధానాచార్య ఎం.అనిల్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విజయవంతమైన రక్తదాన శిబిరం

విశాలాంధ్ర-సోంపేట : అంతర్జాతీయ రక్తదాతల దినోత్సవం సందర్భంగా శనివారం సోంపేటలో ఎస్జీఎఫ్ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉద్దానం బ్లడ్ బ్యాంక్ సోంపేట వారి సౌజన్యంతో నిర్వహించిన రక్తదాన శిబిరం విజయవంతమైంది. మొత్తం 63 మంది ఈ కార్యక్రమంలో పాల్గొని రక్తదానం చేయడం విశేషం. వీరిలో మొట్టమొదటిసారిగా 13 మంది రక్తాన్ని దానం చేశారు. వీరిలో ఆరుగురు మహిళలు కూడా ఉండడం విశేషం. ఈ సందర్భంగా రక్తదాన ఆవశ్యకతను గూర్చి వివరించారు. ఎంతో మంది ప్రాణాలు కాపాడుటకు రక్తదానం తోడ్పడుతుందని అన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చని సూచించారు. ఇదిలా ఉండగా సోంపేటకు చెందిన ఎస్ఎస్ సేవా ఫౌండేషన్ అధినేత డాక్టర్ దుద్ది శ్రీనివాస్ ఆధ్వర్యంలోను పలువురు వ్యక్తులు రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తాన్ని దానం చేశారు. కార్యక్రమంలో పలు సేవా సంఘాలు, రోటరీక్లబ్, లయన్స్ క్లబ్ సభ్యులతో పాటు సోంపేట పెద్దలు పాల్గొన్నారు. రక్తదానం చేసిన వారికి ఎస్జీఎఫ్ తరపున ధృవపత్రాలను అందజేశారు.

రైతు సేవలో కూటమి ప్రభుత్వం

విశాలాంధ్ర-సోంపేట/కంచిలి : కూటమి ప్రభుత్వం రైతుల సేవలో అనేక విధాలుగా తోడ్పాటునందిస్తుందని కంచిలి మండలం టీడీపీ సీనియర్ నేత మాదిన రామారావు పేర్కొన్నారు. కంచిలి మండలం బూరగాం పంచాయతీలో నీటిపారుదల శాఖ మంజూరు చేసిన 4లక్షల రూపాయలతో పద్మనాభ సాగర్ నుంచి కూర్మాన సాగర్ వరకు కాలువ పూడికతీత పనులు చేపట్టారు. దీని వల్ల వందలాది ఎకరాలకు సాగునీరు సక్రమంగా అందించడం జరుగుతుందని అన్నారు. ఈ మేరకు శనివారం పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి బొడ్డు అప్పారావు, బంగారు కురయ్య, పిలక చిన్నబాబు, నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడు బొట్ట వాసుదేవ్, తదితరులు పాల్గొన్నారు.